జర్నలిస్ట్ నిఘా

కలం.. మా బలం..

సంపుటి : 2 సంచిక : 185 కాకినాడ శుక్రవారం 6 ఏప్రిల్ 2018

# జెఎన్టీయుకెలో ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



కాకినాడ రూరల్ (నిఘా విలేకరి): జెఎన్‌టియుకెలో గురువారం డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ 111వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ ఉన్నతాధికారులు జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెక్టార్ ప్రొ.కె.పూర్ణానందం విచ్చేయగా, గౌరవ అతిథులుగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ & చీఫ్ ఇంజనీర్ ప్రొ.వి.రవీంద్ర, అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.వి.రామలింగరాజు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ డా.ఏ.స్వర్ణకుమారి, బిక్స్ డైరెక్టర్ ప్రొ.జి.ఏసురత్నం, ఈసిఈ విభాగాధిపతి ప్రొ.కె.పద్మప్రియ విచ్చేశారు. ఈ నేపథ్యంలో రెక్టార్ ప్రొ.కె.పూర్ణానందం మాట్లాడుతూ దళితుల ఉన్నతికి విశేషంగా పాటుపడిన జగజ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని, వక్తగా, రాజకీయ నాయకునిగా, సంఘ సేవకునిగా, రక్షణ శాఖామంత్రిగా, వ్యవసాయ శాఖామంత్రిగా పలు పదవులను అలంకరించి వాటికి వన్నె తెచ్చారన్నారు. ఈ జన్మదినోత్సవాన్ని సమతా దినోత్సవంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. వ్యవసాయ శాఖామంత్రిగా సేవలందించిన సమయంలో హరిత విప్లవం, భూ సంస్కరణలు చేపట్టి రైతులకు దన్నుగా నిలిచారన్నారు. అలాగే నీటి సరఫరాపై పన్ను విధిస్తే రైతుల కోసం జగజ్జీవన్‌రామ్ పోరాటం చేసి పన్నును నిషేధించేలా చేశారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఆయన చేసిన పోరాటాలు ఎనలేనివన్నారు. ఇంతటి మహనీయులైన జగజ్జీవన్‌రామ్ దేశభక్తి, సేవాతత్పరత, రాజకీయ చతురత కీర్తించదగినదని, ప్రస్తుత తరాలకు ఆయన స్ఫూర్తిదాయకంగా నిలుస్తారన్నారు. స్వాతంత్ర్య సమరయోధునిగా సంఘంలో నెలకొన్న అసమానతలను రూపుమాపడానికి గాంధేయ మార్గంలో ఆయన పోరాడిన విధానం కొనియాడదగినదన్నారు. అసమానత్వం, అంటరానితనం, ఆర్థిక అసమానతలను నిర్మూలించినపుడే ఇలాంటి మహనీయుల కలలను నిజం చేసినవాళ్లమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.